
ఆంధ్రజ్యోతి



కామారెడ్డి
జిల్లా వార్తలు

ఫేస్ టు ఫేస్



సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

• డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

ప్ర: సీజనల్ వ్యాధుల పట్ల చర్యలు తీసుకుంటున్నా?

జ: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రస్తుతం దోమకాటు వ్యాధుల ప్రభాల్యం ఉంటుంది. ముఖ్యంగా ఈ2నెలల పాటు డెంగ్యూ, మలేరియా కేసులు నమోదవుతాయి. కట్టడి నిల్వ నీటిని తొలగించేలా చేయడంతోపాటు ఆయిల్‌బాల్స్ వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: ఈ ఏడాది డెంగ్యూ, మలేరియా కేసులెన్ని?

జ: ఈఏడాది డెంగ్యూ, మలేరియా కేసులు తగ్గాయి. గతేడాది డెంగ్యూ కేసులు 181 నమోదు కాగా ఈసారి 90వరకు నమోదయ్యాయి. మలేరియా కేసులు జీరో.

ప్ర: డెంగ్యూ నిర్ధారణకు ఏ పరీక్షను చేస్తున్నారు?

జ: డెంగ్యూ నిర్ధారణకు టీహబ్‌లో ఏలిసా టెస్టును చేస్తున్నాం. ఆయా పీహెచ్‌సీలలో స్పాట్ టెస్టులు చేస్తు వైరల్ ఫీవర్, ఇతర జ్వరాల నిర్ధారణలు చేస్తున్నాం. ఒక వేళ డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే టీహబ్‌లోనే ఏలిసా టెస్ట్ చేసి పాజిటివ్ అని వస్తేనే తగిన చికిత్స అందించాలని సూచిస్తున్నాం. ప్రైవేట్ ఆసుపత్రిలో అవసరం లేకున్నా డెంగ్యూపేరుతో చికిత్స చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: జిల్లాలో స్వస్థనారీ, ఎన్‌సీడీ ప్రోగ్రాంలు ఎలా కొనసాగుతున్నాయి?

జ: జిల్లాలో స్వస్థనారీ, ఎన్‌సీడీ ప్రోగాంలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే స్వస్థనారీ కార్యక్రమాన్ని ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో చేపట్టిమహిళలకు గైనిక్ పరీక్షలతోపాటు ఇతర వ్యాధులపై అవగాహన కల్పించి అవసరమైన వారికి మందులు అందించాం. ఇక ఎన్‌సీడీ ప్రోగ్రాం అనేది నిత్యం కొనసాగుతున్న ప్రక్రియ. అవసరమైన ప్రజలకు మందులు అందిస్తున్నాం.

ప్ర: నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లపై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జ: నిబంధనలు పాటించని, రిజిస్ట్రేషన్ లేని ఏడు డయాగ్నస్టిక్, సీటీ స్కాన్, ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు అందించాం. మార్పు రాకపోతే సీజ్‌చేస్తాం.

ప్ర: శీతాకాలంలోవచ్చే వ్యాధులకు జాగ్రత్తలు ఏంటి?

జ: చలి ఎక్కువైతే చిన్నపిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తవచ్చు. తల్లిదండ్రులు పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

• కామారెడ్డి టౌన్, ఆంధ్రజ్యోతి

మత్స్యకారుల ఉపాధికి దోహదపడుతున్న ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం అమలుపై ఈసారి కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. చేపపిల్లల పంపిణీ టెండర్లకు కాంట్రాక్టర్‌లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈయేడు చేపపిల్లల పంపిణీ లేనట్లేనని అధికారవర్గాలు చెబుతున్నాయి.



చేపపిల్లల పంపిణీ

లేనట్టేనా?

- టెండర్లకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్‌లు
- మూడుసార్లు టెండర్లు వేసినా ముందుకు రాని పరిస్థితి
- గత రెండేళ్లుగా రూ.3కోట్లకు పైగా బకాయిలే కారణం
- గత ఏడాది సైతం 50శాతం మాత్రమే పంపిణీ
- ఈసారి 2.82 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం
- మత్స్యకారుల్లో ఆందోళన

కామారెడ్డి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గత ఏడాది టెండర్ల ప్రక్రియను అలస్యంగా మొదలుపెట్టింది. కాంట్రాక్టర్‌లు కూడా అంతగా ఆసక్తి చూపలేదు. అదును దాటాక చెరువుల్లో చేపపిల్లలను వదిలారు. అవి ఎదుగక మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారు. గత రెండేళ్లుగా చేపపిల్లలను పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌లకు రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోవడంతో టెండర్లలో పాల్గొనేందుకు చాలా మంది విముఖత చూపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది మూడుసార్లు కాల్‌చేసిన టెండర్లకు ఎవరూ కూడా దరఖాస్తులు చేసుకోలేదు. దీంతో జిల్లాలో చేపపిల్లల పంపిణీ అనుమానమేనని మత్స్యసంఘాలు సైతం చెబుతున్నారు.

227 మత్స్య సహకార సంఘాలు

కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 227 మత్స్యసహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక మత్స్య సహకార సం ఘాలు 185, మహిళా మత్స్యసహకార సంఘాలు 40, ఒక మత్స్య శాఖ మార్కెటింగ్ సొసైటీ, ఒక జిల్లా మత్స్యసహకార సంఘం ఉన్నాయి. ఇందులో మొత్తం 13,894 మంది మత్స్యకారులు సభ్యత్వం పొందినవారు ఉన్నారు. అయితే గత 8 ఏళ్లుగా (మిగతా 8వ పేజీలో)

మత్స్యకారులకు తప్పని ఎదురుచూపులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా పంపిణీచేసే ఉచిత చేపపిల్లల పథకం ద్వారా చేపలను పెంచి మత్స్యకారులు జీవనోపాధిని పొందుతున్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో చేపపిల్లలు అందకపోవడంతో మత్స్యకారులు సొంత డబ్బులతో కొనుగోలుచేసి చెరువులు, కుంటల్లో వదులుతున్నారు. మరికొందరు ప్రభుత్వం ఇచ్చే ఉచిత చేపపిల్లల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అదునుదాటిపోవడంతో గత ఏడాది మాదిరిగానే సగం మాత్రమే సరాఫరా చేస్తారేమోనని మత్స్యకారులు భావిస్తున్నారు.అయితే టెండర్లకు కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడంతో చేపపిల్లల పంపిణీ ఉంటుందా లేదా అనే ఆందోళన మత్స్యకారుల్లో నెలకొంటుంది.

త్వరలోనే విడుదల చేస్తాం : శ్రీపతి, మత్స్యశాఖ జిల్లా అధికారి



చేపపిల్లల పంపిణీకి టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికేమూడుసార్లు టెండర్లు పిలిచాం. కానీ కాంట్రాక్టర్‌లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో టెండర్ల ప్రక్రియను రద్దుచేశాం. టెండర్ల ప్రక్రియను చేపట్టి చేపపిల్లలను పంపిణీచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. త్వరలోనే ప్రభుత్వ ఆదేశాలతో ఇతర మార్గాల ద్వారా చేపపిల్లలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోనుంది.

సబ్సిడీ టార్పాలిన్లు అందేనా..? 7



సమస్యల వలయంలో పల్లెలు 7





మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేస్తున్న మహిళ

నూతన మద్యం పాలసీలో

రిటైలర్ మార్జిన్

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిర్మల్ జిల్లా అధికారి అబ్దుల్ రజాక్

నిర్మల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ 2025-2027లో రిటైలర్ మార్జిన్ ఉంటుందని, మద్యం విక్రయాల్లో ఆర్డినరీ లిక్కర్‌పై 27శాతం మార్జిన్, మీడియం, ప్రీమియం బీర్‌లపై 20శాతం మార్జిన్ ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిర్మల్ జిల్లా అధికారి అబ్దుల్‌రజాక్ తెలిపారు. మద్యం టెండర్ల దరఖాస్తుల స్వీకరణకు అక్టోబరు 18వరకు గడువు ఉంది. అక్టోబరు 23న మద్యం దుకాణాల దరఖాస్తులను లాటరీ పద్ధతిలో డ్రా ద్వారా ఎంపిక చేస్తారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. ప్రతీ దరఖాస్తుకు ఆధార్‌కార్డు లేదా పాన్‌కార్డు, మూడు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేయాలి. ప్రతీ దరఖాస్తు వెంబడి రూ.3లక్షల రుసుముగా నాన్ రిఫండబుల్ ఫీ చెల్లించాలి. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన వేయడానికి అవకాశం ఉంటుంది. ఒకరు ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తులను వేయడానికి అవకాశం కల్పించారు. డీడీ లేదా చలాన్లను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పేరుపై తీయాల్సి ఉంటుంది.

రైతులు ధాన్యాన్ని

రోడ్డుపై ఆరబెట్టొద్దు

- ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డిటౌన్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టొద్దని ఎస్పీ రాజేష్‌చంద్ర కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరం అక్టోబరులో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 27 మంది మృతి చెందగా అందులో ఎక్కువభాగం, రోడ్లపై మక్కలు, వడ్లు, ఆరబెట్టడంతో జరిగినవని వివరించారు. రోడ్లపై పంటలు ఆరబెట్టడంతో వాహనాలు జారి, అదుపు తప్పడం, రోడ్డు మీద కూర్చున్న రైతులు లేదా పాదచారులు ఢీకొనడం వంటి ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యంతో నిండు ప్రాణం పోందుతుందని, అందరి భద్రత మన చేతుల్లోని ఉందని ఎస్పీ తెలిపారు.

జిల్లా సరిహద్దులో తనిఖీలు

దోమకొండ (బీబీపేట): మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలకు సరిహద్దులో ఉన్న బీబీపేట శివారులో పోలీసులు ప్రతీరోజు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. బీబీపేట పోలీసు స్టేషన్‌ను సోమవారం ఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు, రిజిస్టార్‌లను పరిశీలించారు. సిబ్బంది యొక్క విధులు వివరాలను ఎస్సై ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల క్రమశిక్షణ కలిగి ఉండాలని ఆదేశించారు. స్టేషన్‌లో పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్తి సంబంధిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. డయల్ 100 ద్వారా అందే ఫిర్యాదులపై వేగంగా, సమర్థవంతంగా స్పందిస్తూ ప్రజలకు విశ్వాసం కలిగించేలా వ్యవహరించాలని అన్నారు. ఆయన వెంట ఏఎస్పీ చైతన్యరెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



వినతిప్రతాన్ని అందజేస్తున్న నాయకులు

దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు

- ప్రజావాణికి 90 దరఖాస్తులు
- స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ చందర్ నాయక్

కామారెడ్డి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 90 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చందర్‌నాయక్ మాట్లాడుతూ ప్రజల తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదు చేస్తారని, వాటిని క్షుణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో పార్థసింహారెడ్డి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ ఏవో, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో ఆహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో (మిగతా 8వ పేజీలో)

కనీస మద్దతు ధరల

పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదలచేస్తున్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన కనీస మద్దతు ధరల పోస్టర్‌ను కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, అధికారులు సోమవారం విడుదల చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఎంఎస్‌పీ ధరలు, కాటన్ కాపాస్ కిసాన్ యాప్‌కి సంబంధించిన కాటన్ ప్రోక్యూర్మెంట్ పోస్టర్‌లను ఆవిష్కరించినట్లు తెలిపారు. కనీస మద్దతు ధరల పోస్టర్లను రైతులకు ఉపయోగం కోసం ఆవిష్కరించినట్లు చెప్పారు. వీటిని జిల్లాలోని ప్రతీ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సరాఫరా చేస్తామని (మిగతా 8వ పేజీలో)



సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల

కాంగ్రెస్ పార్టీ

అణగారిన వర్గాల గొంతుక

- 2025 పార్టీ పునరుద్ధరణ సంవత్సరంగా ఏఐసీసీ ప్రకటన
- జిల్లాలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం
- డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు
- ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల

కామారెడ్డిటౌన్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): అణగారినవర్గాల గొంతుకగా కాంగ్రెస్‌పార్టీ ముందుంటుందని ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల అన్నారు. 2025 పార్టీ పునరుద్ధరణ సంవత్సరంగా ఏఐసీసీ ప్రకటించిందని, అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీని పునాది నుంచి పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఏఐచెప్పారు. సోమవారం జిల్లాకేంద్రంలో ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటుచేసిన అనంతరం ఆయన విలేకరుల మాట్లాడారు. సంఘటన్ సృజన్‌అభియాన్ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. గల్లినుండి ఢిల్లీ పార్లమెంట్ వరకు కాంగ్రెస్ ప్రజల కోసంపోరాడుతుందనితెలిపారు. పార్టీ (మిగతా 8వ పేజీలో)

వరి కోత యంత్రం

గంటకు రూ.4వేలు

- వరి కోతలు షురూ
- చైన్ యంత్రాలకు డిమాండ్
- ఖర్చులు పెరుగుతున్నాయని రైతుల ఆవేదన



లింగంపేటలో వరి ధాన్యం కోస్తున్న యంత్రం

లింగంపేట, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటచేలల్లో నీరు, బురద చేరడంతో మామూలు యంత్రాలు వరి కోతకు ఉపయోగపడటం లేదు. దీంతో చైన్ యంత్రాలకు డిమాండ్ పెరిగింది. యంత్రాల యజమానులు సుమారు గంటకు రూ.4వేలు వసూలు చేస్తున్నారు. దీంతో ఖర్చులు పెరిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ యంత్రాలైతే గంటకు రూ.2వేలు మాత్రమే ఉండేది. కానీ బురద కారణంగా చైన్ యంత్రాల అవసరం ఏర్పడి అదనపు భారం పడుతుందని అన్నదాతలు చెబుతున్నారు. ఇప్పటికే అధిక వర్షాలతో పంట పొలాల్లో (మిగతా 8వ పేజీలో)

వ్యసనాలతో యువత చిత్తు

- మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్న వైనం
- ఆన్‌లైన్ గేమ్స్‌తో కష్టాలను కొనితెచ్చుకుంటున్న యువకులు



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

బాన్సువాడ రూరల్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలతో యువత జీవితాలను చిత్తు చేసుకుంటోంది. పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వాలని తల్లిదండ్రులు ఎన్నో కలలు కంటున్నా కొంతమంది యువత చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకుంటున్నారు.

మొబైల్, మద్యం మాయలో యువత

మొబైల్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ఇంట్లో ప్రతీ ఒక్కరికి మొబైల్ సాధారణమైంది. కొందరు మొబైల్‌ను మంచి కోసం ఉపయోగిస్తుంటే మరికొందరు మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్‌కు, చెడువ్యసనాలకు అలవాటు పడి అప్పులపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎక్కువగా వాహనాలను నడిపేవారు మొబైల్‌లో మాట్లాడుతూ నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో యువతలో చాలామంది ఎక్కువగా మద్యం, మొబైల్‌కు అలవాటుపడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. వీటన్నింటి పక్కనపెట్టి విద్య, ఉపాధి వైపు తమ లక్ష్యాన్ని ఏర్పర్చుకుని అందుకు అనుగుణంగా ముందుకువెళ్తేనే సమాజంలో తమకంటూ గుర్తింపు వచ్చి తమ జీవితాలను అందంగా మార్చుకునే వీలుందని అభిప్రాయపడుతున్నారు.

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు..

గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా నడుపుతున్నారు. మైనర్లు సైతం మద్యానికి బానిసలవుతున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులను నిషేధిస్తేనే కొంతైనా యువత మద్యానికి బానిసలుగా కాకుండా అడ్డుకట్ట వేసినట్లు అవుతుందని ప్రజలు కోరుతున్నారు. అధికారులు గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చి బెల్టుషాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అవగాహన కల్పించినా మారని తీరు

యువతలో చెడు వ్యసనాలను అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా మార్పు కనిపించడం లేదు. ముఖ్యంగా మైనర్లు, విద్యార్థులు మత్తుకు, ఈజీ మనికి అలవాటు పడటంతో వారి జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటుగా వారి తల్లిదండ్రులను ఇబ్బందుల పాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువు, ఉద్యోగం కోసం కష్టపడాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

పిల్లలపై నిఘా పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే..

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఒకకంట కనిపెడుతూ దురాలవాట్లకు బానిసలు కాకుండా చూడాలి. కుటుంబ పరిస్థితులను వివరిస్తూ సమాజంలో వ్యసనాలకు గురైనా వారి దుస్థితిని వివరిస్తూ చైతన్య పర్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పిల్లల పట్ల ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

క్రైం సమాచారం

ఇజ్రాయెల్‌లో వెంకటాపూర్ వాసి మృతి

వేల్పూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం ఇజ్రాయెల్ దేశం వెళ్లి అక్కడ గుండెపోటుతో మండలంలోని వెంకటాపూర్ వాసి నీరడి బొర్రన్న(52) ప్రాణాలు కోల్పోయారు. మూడేళ్ల కిందట తన చిన్నకూతురు పెళ్లి చేసి తిరిగి ఇజ్రాయెల్ వెళ్లిన బొర్రన్న ఈనెల 11న ఉదయం బాత్‌రూంకు వెళ్లగా అకస్మత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో అక్కడే ఉన్న మిత్రులు బాత్‌రూం వద్దకు వెళ్లి చూడగా బొర్రన్న కుప్పకూలి పడిపోయి కొన ఊపిరితో అల్లాడుతుండడంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా.. కొంత సేపటికే మరణించారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా బొర్రన్న కుటుంబీకులకు సమాచారం అందజేశారు. ఆయన మృతదేహం కోసం కుటుంబీకులు, బంధువులు ఎదురుచూస్తున్నారు. మరణించిన వార్త తెలిసినప్పటి నుంచి కుటుంబీకులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. బొర్రన్నకు భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

దొంగ అరెస్ట్.. సొమ్ము రికవరీ

గాంధారి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చద్మల్ వెళ్లే రహదారి పక్కనున్న శివభక్త మార్కండేయ గుడిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 25రోజుల క్రితం ఆలయంలో చోరీ జరిగినట్లు, గ్రామానికి చెందిన నాగ్లూర్ సాయికుమార్ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాలను పరిశీలించగా అనుమానాస్పదంగా కనిపించిన ఉప్పు సతీష్‌ను పట్టుకుని విచారించగా.. దొంగతనాలను చేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడి నుంచి రూ.470, బైక్‌ను స్వాధీనం చేసుకుని ఎల్లారెడ్డి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ సంజయ్‌కుమార్, బంతీలాల్‌ను ఎస్సై అభినందించారు.

వైన్స్‌లో చోరీ.. కేసు నమోదు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): వైన్స్‌లో దొంగతనం ఘటనపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపారు. మండలకేంద్రంలోని త్రిశూల్ వైన్స్ నిర్వాహకుడు మహేందర్‌గౌడ్ ఈనెల 12న రోజూమాదిరిగానే రాత్రి దుకాణం మూసేసి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం షాప్ తీయగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయని, క్యాష్ కౌంటర్‌లోని రూ.15వేలు మాయమయ్యాయని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్సై వివరించారు.

పెగడాపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్..

బోధన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడాపల్లి శివారులోని పంట పొలాల్లో ఆదివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ సామాగ్రి దొంగిలించారని రైతులు తెలిపారు. పంట పొలాలకు ఉపయోగపడే ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను కట్ చేసి అందులో ఉన్న సామాగ్రిని ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

ఆరుగురు మహిళలకు జైలు

సుభాష్‌నగర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతంలో న్యూసెన్స్ చేసి శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన ఆరుగురు మహిళలకు సిటీ పోలీస్ యాక్ట్ 68 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా ఒకరికి ఒక్క రోజు, ఐదుగురికి 2రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతంలో మగవారిని ఆకర్షించేలా వారి హావభావాలు ప్రదర్శిస్తూ.. న్యూసెన్స్ చేస్తున్నారని వివరించారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురికి..

బోధన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న రాకాసిపేట్‌కు చెందిన సల్మాన్‌కు 2రోజుల పాటు కోర్టు జైలుశిక్ష విధించిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. కోనాపూర్‌కు చెందిన మహ్మద్ ఫెరోజ్‌కు ఒకరోజు జైలుశిక్ష విధించిందన్నారు. బోధన్ పట్టణంలోని గోశాల వద్ద మట్కా నిర్వహిస్తున్న మారుతి అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వెయ్యి రూపాయల జరిమానాతో పాటు ఒక రోజు జైలుశిక్ష విధించారన్నారు.

ఎడపల్లి,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):మండలంలోని జానకంపేటకు చెందిన షేక్ అమీర్ మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ మట్కా ఆడిపిస్తూ పట్టుబడగా అతనిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని ఎస్సై ముత్యాలరమ తెలిపారు. అలాగే నిజామాబాద్‌కు చెందిన షేక్ సలీం, సయ్యద్ మెహతార్, సుభాష్ సోమవారం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడటంతో బోధన్ కోర్టులో హాజరుపర్చగా.. వారికి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు చెప్పారు.

బాలికను ఢీ కొట్టిన వాహనం

నిజాంసాగర్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తున్న బొలేరా వ్యాన్ బహిర్భూమికి వెళ్లిన బాలిక మ్యాతరి మధుశ్రీ పరిగెత్తుకుంటూ రావడంతో ఢీకొంది. దీంతో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను ఎల్లారెడ్డి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తిరిగి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా మృతిచెందినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. బాలిక తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ మృతి

బాన్సువాడటౌన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాన్సువాడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బుర్రి భూమేశ్ (31) రెండు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఈ నెల 10న భార్యతో బయటకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి రాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చాడు. భార్యకు పురుగుల మందు వాసన రావడంతో అనుమానం వచ్చి తన భర్తను అడుగగా , కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగానని చెప్పారు. చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుర్రి భూమేశ్ (31) ఆదివారం రాత్రి మృతిచెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భిక్కనూరులో భారీ దొంగతనం

భిక్కనూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు దొంగతనానికి పాల్పడిన సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో చంద్రశేఖర శర్మ కుటుంబంతో కలిసి ఉంటున్నారు. 3రోజుల క్రితం ఆయన హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఆయన సోదరుడు ఇంటికి రాగా.. తలుపులు పగలగొట్టి ఇంట్లో సామాను చిందరవందరంగా పడిఉంది. బీరువాలో దాచి ఉంచిన బంగారు ఆభరణాలు, నగదు కన్పించకపోడంతో తన అన్నయ్య చంద్రశేఖరశర్మకు సమాచారం అందజేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంతో వేలిముద్రలను సేకరించింది. ఇంట్లోని, రోడ్డుపై, వైన్స్ వద్ద, పెట్రోల్‌బంక్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. 15తులాల బంగారం, రూ.50వేల వరకు నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం.

ఆరోపణల్లో వాస్తవం లేదు

- రాంపూర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్

ఇందూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి పట్ల తాను కులం పేరుతో దూషించినట్లు తల్లిదండ్రులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేష్‌గౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థికి సెలవుల అనంతరం ఆలస్యంగా రావడంతో నూతన పెట్టె ఇవ్వలేదని చెప్పడంలో వాస్తవం లేదని ఆదివారమే పెట్టె ఇచ్చేశామన్నారు. తాను టీసీ ఇచ్చి పంపిస్తానని నలేదని, పాఠశాలలో విద్యార్థుల పట్ల, తల్లిదండ్రుల పట్ల గౌరవభావంగా ఉంటున్నానని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణల వల్ల ప్రతిష్ఠ దెబ్బతినే అవకాశం ఉందని, తల్లిదండ్రులు ఇవి నమ్మవద్దని కోరారు.

ట్రా‘ఫికర్’

- బోధన్‌లో ట్రాఫిక్ కష్టాలు
- ఏటా పెరుగుతున్న వాహనాలు
- సిగ్నల్ వ్యవస్థ సరిగా లేక తిప్పలు
- వాహనదారుల అవస్థలు
- సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు వినతులు

బోధన్,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో మాదిరిగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని పట్టణవాసులు పేర్కొంటున్నారు. పట్టణంలోని ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ సీఐతో పాటు కానిస్టేబుళ్లు ఉన్నప్పటికీ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, శక్కర్‌నగర్ చౌరస్తా, అనిల్ చౌరస్తా తదితర ప్రధాన కూడళ్లల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యను నియంత్రించవచ్చు. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విస్తరిస్తున్న పట్టణం

పట్టణంలో జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య పెరుగుతోంది. బోధన్ 6 ఏళ్ల కిందట 21చదరపు కిలో మీటర్లు ఉండగా.. ప్రస్తుతం 41చదరపు కిలోమీటర్లకు పెరిగిందని అధికారులు చెబుతున్నారు. 3-5కి.మీ విస్తీర్ణంలో పట్టణం విస్తరించింది. రోజురోజుకు పరిసరాల ప్రాంతాల్లో కొత్త కాలనీలు ఏర్పడడంతో పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటికీ ఒక్క సిగ్నల్ కూడా లేకపోవడం గమనార్హం.



బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా

సిగ్నల్ వ్యవస్థ లేక..

ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రముఖులు, యువజన నాయకులు ప్రభుత్వానికి నివేదించిన ఫలితం మాత్రం కానరావడం లేదు. అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, శక్కర్‌నగర్ చౌరస్తా, పెగడాపల్లి చౌరస్తాలో తప్పనిసరిగా ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటైతే పరిష్కారం



బోధన్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్నతాధికారులు ఆదేశిస్తే ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. నిధుల కొరత మూలంగానే ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు ఆలస్యం అవుతుంది. మార్చిలోగా బోధన్‌కు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు అయితే బోధన్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నివారించవచ్చు.

- చందర్ రాథోడ్, ట్రాఫిక్ సీఐ బోధన్

కుట్టు శిక్షణతో ఉపాధి

కోటగిరి,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): కుట్టు మిషన్ శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో పద్మజ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో సోమవారం హోప్ ఫర్ లైఫ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి సీడీపీవో ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. శిక్షణ 45 రోజుల పాటు కొనసాగుతుందని, మహిళలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొమురవ్వ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అవకాశం కల్పించాలి

నవీపేట,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో ముగ్గురు పిల్లలున్న వారికి పోటీకి అవకాశం కల్పించాలని మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ సాయిలు సోమవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని కోరాడు. జిల్లాకేంద్రంలో జరిగిన ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. 1995 సంవత్సరం తర్వాత ముగ్గురు పిల్లలు ఉన్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పేర్కొంటూ ఉన్న జీవోను వెంటనే తొలగించాలని కోరారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సాయిలు పేర్కొన్నారు.

రిజర్వేషన్ అమలుచేయాలి

నవీపేట,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక మండల కన్వీనర్ నాయక్‌వాడి శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు కాకుండా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లకు ఎవరైనా అడ్డుపడితే సహించేది లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో దేవేందర్ సింగ్, ఒడ్డెన్న, వసంత్, కిషన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో ఇళ్ల నుంచి ఖాళీ చేయిస్తున్న తహసీల్దార్, ఎస్సై

ఇళ్ల ఆక్రమణ.. ఖాళీ చేయించిన అధికారులు

మోర్తాడ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ ఇళ్లను కొందరు ఆక్రమించుకోగా.. మండల అధికారులు ఖాళీచేయించారు. సోమవారం తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో తిరుమల, ఎస్సై రాము, ఆర్ఐ రంజిత్, పోలీస్ సిబ్బంది డబుల్ బెడ్ రూం ఇళ్లను తనిఖీచేశారు. గత ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేయగా.. సుమారు 65 ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. కొందరు అధికారులు వేసిన తాళాలను పగలగొట్టి నివాసం ఉంటున్నారు. గతంలో కూడా అధికారులు వారిని వెళ్లగొట్టి హెచ్చరించినా ఆక్రమించడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా ఉండటం నేరమని, ఖాళీ చేయాలని సూచించారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



రజత పతకం అందుకుంటున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీల్లో ఇందూరుకు రజతం

రెంజల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో నిజామాబాద్ జిల్లా నుంచి తాడ్‌బిలోలి పాఠశాల విద్యార్థులు నెట్‌బాల్ పోటీలలో రజత పతకాన్ని సాధించారని పీఈటీ కుమార్ తెలిపారు. ఈ నెల 9 నుంచి 12 వరకు కొనసాగుతున్న జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో తాడ్‌బిలోలి పాఠశాలకు చెందిన విద్యార్థులు అజయ్ కుమార్, శృతి, నయనశ్రీ, రాకేష్, అమర్‌లు నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి రజత పతకం సాధించడంతో పాఠశాల బృందం వారిని అభినందించింది. రజత పతకం సాధించేందుకు కృషి చేసిన పీఈటీ కుమార్‌ను ఉపాధ్యాయ బృందం ప్రశంసించింది.

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

కమ్మర్‌పల్లి,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ సదస్సుల్లో రైతులు చేసుకున్న భూభారతి దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అధికారులను ఆదేశించారు. సోమవారం కమ్మర్‌పల్లి మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతిలో రైతులు చేసుకున్న దరఖాస్తులను ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించారు. రికార్డులను భద్రంగా ఉంచాలని సూచించారు. గ్రామపాలన అధికారులకు సూచనలు చేస్తూ.. అందరూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ గొడిసెల ప్రసాద్, మండల రెవెన్యూ అధికారి శతీష్, ఏఆర్ఐ ప్రదీప్, సీనియర్ అసిస్టెంట్ మౌనిక, జూనియర్ అసిస్టెంట్‌లు నరేందర్, జ్యోతి, శివజ్యోతి, భానుచందర్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

టీకాలతో పాడి పశువులను కాపాడుకోవాలి

బోధన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు టీకాలు వేయించి వాటిని రైతులు కాపాడుకోవాలని జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ రోహిత్ రెడ్డి సూచించారు. సోమవారం బోధన్ మండలంలో పశువులకు టీకాలు వేశారు. అనంతరం బోధన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నట్లు చెప్పారు. ఇందకుఉ 82 బృందాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లాలో 58,490 ఆవు జాతి, 1,39,341 గేదె జాతి పశువులున్నాయని వివరించారు. జిల్లాలోని పాడి రైతులు పశు పోషకులు ఆరు నెలలు దాటిన తమ పశువులు అన్నింటికి తప్పకుండా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని పేర్కొన్నారు. పశువులు నీరసపడి మేత మేయలేక చనిపోయే అవకాశం ఉంటుందన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారులు



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు

బీసీలు ఐక్యంగా పోరాడాలి

ఆర్మూర్‌టౌన్ , అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం రావాలంటే బీసీలందరు పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొయడ నర్సింహగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు స్టే దృష్ట్యా ఆగిన రిజర్వేషన్ల సాధనకై బీసీ సంఘాలన్నీ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. బీసీలు ప్రతీఒక్కరు రాజ్యాధికారం దిశగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగామోహన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి శ్యాం, ఉపాధ్యక్షుడు శ్రీరాంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గుట్టపై పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

సిద్ధులగుట్టపై ఘనంగా పల్లకి సేవ

ఆర్మూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్ధులగుట్టపై సోమవారం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో గుట్టపైకి తరలివచ్చి శివాలయంలో పంచామృతాలు, బిల్వ పత్రాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ ఆలయం, అయ్యప్ప స్వామి, ఎల్లమ్మ తల్లి ఆలయంలో భక్తులు, మహిళలు పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో భక్తులు భజనలు, భక్తీ గీతాలు ఆలపిస్తూ పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, ఒడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మి రవి, సంధ్య, బట్టు శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, మంజుల మురళి, రామాగౌడ్ పాల్గొన్నారు.



ఎల్లమ్మ తల్లిని ఊరేగిస్తున్న గౌడ సంఘం సభ్యులు

ఘనంగా పుట్ట ఎల్లమ్మ ఉత్సవాలు

మెండోర , అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పుట్ట ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు ఆరు రోజులుగా అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గౌడ సంఘం సభ్యులు ఉదయం బోనాలు కంఠ మహేశ్వరుడిని పుట్ట ఎల్లమ్మ ఆలయం వద్దకు తీసుకెళ్లి మైలు సుంకం, దిట్ట, ఎల్లమ్మ, వేషాలు, పరమేశ్వరుడి వేషాలు వేసుకుని బోనాలతో పుట్ట ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లంది కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని మంగళహారతులు డప్పు సప్పులతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో పద్మజ

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రెంజల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు, వాటి ద్వారా తల్లీబిడ్డలకు ఆరోగ్యకరంగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో పద్మజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రెంజల్, ఎడపల్లి, జానకంపేట సెక్టార్ల ఆధ్వర్యంలో పోషణ మాసం వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. బరువు తక్కువున్న పిల్లలను ఎన్ఆర్‌పీకి రిఫర్ చేయడంతో పాటు గర్భం దాల్చిన నుంచి రెగ్యులర్‌గా రెండేళ్లు పూర్తయ్యే వరకు వెయ్యి రోజుల ప్రాముఖ్యం గురించి వివరించారు. పోషణ మాసంలో భాగంగా చిన్న పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, సూపర్‌వైజర్‌లు సౌజన్య, సావిత్రి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ నరేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తరగతులు ప్రారంభం

ముప్కాల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించిందని ఎంఈవో రాజేశ్వర్ తెలిపారు. బాల్కొండ మండలంలోని నాగపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఎంపికైన ప్రీప్రైమరీ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కిసాన్‌నగర్ హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయుడు రవికుమార్, వీడీసీప్రతినిధులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు షురూ..

ఆలూర్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని డీకంపల్లి రామస్వామిక్యాంపులో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో గంగాధర్ ప్రారంభించారు. రైతుల కష్టానికి తగిన ధర లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, వారికి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిగేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి దినేష్, ఏపీఎం ఉమా కిరణ్, సీసీ రాజారమేష్, సీఏ అనిత, సమాఖ్య అధ్యక్షురాలు మాధురి తదితరులున్నారు.



బిడ్డను కుటుంబీకులకు అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

108లో ప్రసవం

మోస్రా,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మోస్రా మండలంలోని లక్ష్మిసాగర్ తండా, మేడపల్లి గ్రామానికి చెందిన శాంతాబాయి కాన్పు నిమిత్తం అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి తరలించే క్రమంలో మార్గమధ్యంలో లక్ష్మాపూర్ వద్ద పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాంబాబు, పైలెట్ రాజుల హన్మాండ్లు, ఏర్పీసీ డాక్టర్ శివ ఆధ్వర్యంలో సాధారణ కాన్పు చేశారు. ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత పీహెచ్‌సీ మోస్రాకి తల్లీబిడ్డని తరలించారు.

చెక్కుల పంపిణీ

ముప్కాల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో, బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్‌లో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నేతలు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు రవి, కిసాన్‌గౌడ్, సాగర్, సంజీవ్‌రెడ్డి, నర్సారెడ్డి, మహిపాల్, వెంకట్ తదితరులున్నారు.

నిశిత ఇంటర్నేషనల్‌కు సీబీఎస్ఈ గుర్తింపు

ఇందూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిశిత ఇంటర్నేషనల్ పాఠశాలకు సీబీఎస్ఈ బోర్డు నుంచి గుర్తింపు లభించిందని ప్రెసిడెంట్ చౌడవరం వినయ్ కుమార్, చైర్మన్ నిఖిల్ చౌడవరం, డైరెక్టర్ పూజా చౌడవరం, కోఆర్డినేటర్ చౌడవరం రాజు సోమవారం తెలిపారు. నిజామాబాద్ లో ప్రముఖ విద్యాసంస్థలలో అగ్రగామిగా నిలిచిన నిశిత విద్యాసంస్థలు 30ఏళ్లుగా విశిష్టమైన విద్యాసేవలను అందిస్తూ విద్యారంగంలో విశేషమైన పేరు తెచ్చుకుందన్నారు. అదే ప్రస్థానంలో భాగంగా నిశిత ఇంటర్నేషనల్ స్కూల్, నిజామాబాద్ 2024 జూన్ నెలలో ప్రారంభమైందని చెప్పారు. పారంభమైన కొద్ది కాలంలోనే, కేవలం ఒకటిన్నర సంవత్సరం కాలంలో, ఈ పాఠశాల గుర్తింపు పొందడం సీబీఎస్ఈ బోర్డు నుండి గుర్తింపు ఒక గొప్ప ఘనతగా నిలిచిందని, ఇటీవల ఈ పాఠశాల సీబీఎస్ఈ అఫిలియేషన్ నంబర్ అందకుందన్నారు. జాతీయ ప్రమాణాల విద్యను అందిస్తూ, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

మోర్తాడ్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు మార్కింగ్ చేశారు. సుమారు 10ఇళ్లకు ఎంపీడీవో తిరుమల, పంచాయతీ కార్యదర్శి సైఫుద్దీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అశోక్, నాగభూషణం, పూజలు చేసి, కొలతలు కొలిచి ముగ్గు పోశారు.

రోడ్డు పనులు చేపట్టాలి

మోస్రా,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ, నిజామాబాద్ ప్రధాన రహదారికి చేపట్టాలని బీజేపీ నాయకులు మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగించే రహదారిని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వారంలో రోడ్డు పనులను పూర్తి చేయకపోతే పెద్దఎత్తున నిరసనకు దిగుతామని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హన్మాగౌడ్, సుదర్శన్ గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

భూపతిరెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఇందూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ లోగల రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాసంలో సోమవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి పరామర్శించారు. భూపతిరెడ్డి తల్లి లక్ష్మినర్సమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. భూపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మినర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజావాణికి పత్తాలేని అధికారులు

» తూ..తూ మంత్రంగా

కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమం

నసురుల్లాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు పత్తాలేకుండా పోతున్నారు. నస్రులాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరుకావడం లేదు. దీంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు వస్తారన్న నమ్మకంతో దరఖాస్తులు తీసుకొని వచ్చారు. కాగా ఆయా శాఖలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమానికి రాకపోవడంతో మండల ప్రజలు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాన్సువాడ ఆర్టీసీ డీఎంగా రవికుమార్


ఎమ్మెల్యే పోచారంను కలిసిన బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్

బాన్సువాడ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఆర్టీసీ నూతన డీఎంగా రవికుమార్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు బాన్సువాడ డిపో మేనేజర్‌గా పనిచేసిన సరితాదేవి హకీంపేట్ డిపోకు బదిలీపై వెళ్లారు. డీఎం రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాన్సువాడ డిపో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్‌ల పంపిణీ


విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న సాయిలు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జప్తి జానకంపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామ మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు నోట్‌బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ సాయిలు తన కూతురు అమూల్య జన్మదిన సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్‌లను, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్ట పడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనసూయ, పంచాయతీ కార్యదర్శి శంకర్ నాయక్, ఉపాధ్యాయులు రాకేష్, సిరాజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై సర్వే చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బాన్సువాడటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై సర్వే చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాన్సువాడలో కేటాయించిన డబుల్ ఇళ్లలో అసలైన అర్హులకు దక్కలేదని వారు ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పేదవారికి అందేలా చూడాలని వారు కోరారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, చీకట్ల రాజు, సాయిరెడ్డి , శంకర్ తదితరులున్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు అందేనా..?

» ఇబ్బందులు పడుతున్న రైతులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతూ అద్దె కోసం వేల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. వరి కోతల సమయంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వర్షాల భారీ నుంచి కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుంటున్నారు. గత ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఐదారేళ్ల క్రితం 8 ఫీట్ల పొడవు ఆరు ఫీట్ల వెడల్పుతో మందం ఉన్న టార్పాలిన్ల ధర మార్కెట్లో రూ.2,500 వరకు ఉండగా వ్యవసాయ శాఖ తరఫున వాటిని రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందజేసింది. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఎంతో సౌలభ్యంగా ఉండేది. వాటి సరఫరా నిలిచిపోవడంతో తాము వేల రూపాయలు ఖర్చు చేసి అద్దెకు తీసుకుంటూ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా ఈదురు గాలులు అకాల వర్షాలతో టార్పాలిన్లు లేక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు.


అద్దె టార్పలిన్లలో ధాన్యం ఆరబోయిస్తున్న రైతులు


గ్రామాల్లో అద్దెకు ఇవ్వడానికి ఉంచిన టార్పాలిన్లు

రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగ పడతాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి వాటిని కాంటా వేసేవరకు కనీసం ఇరవై రోజుల సమయం పడుతుంది. టార్పాలిన్ల అద్దెకు తీసుకువచ్చి వాటికి రెండు నుంచి నాలుగు వేల వరకు అద్దె చెల్లించాల్సి వస్తుందంటున్నారు. ఈ మేరకు మారుమూల గ్రామాలు గిరిజన తండాల్లో సైతం టార్పాలిన్లు అద్దెకు లభిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై తమకు టార్పాలిన్లు అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

● ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వాలి

టార్పలిన్లు అద్దెకు తెచ్చుకుని సుమారు రూ.రెండున్నర వేల నుంచి మూడు వేల వరకు అద్దె చెల్లించడం వల్ల అదనపు భారం పడుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇస్తే మాకు అనువుగా ఉంటుంది.

సాయిలు, రైతు

● సరఫరా కావడం లేదు

ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా కావడం లేదు. దీంతో రైతులకు అందించలేక పోతున్నాం. ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వస్తే రైతులకు అందజేస్తాం.

- నదీముద్దీన్, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డి


బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

బీసీ బంద్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ మద్దతు

సుభాష్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలుపై బీసీ జేఏసీ నాయకులు ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ మద్దతు తెలిపింది. సోమవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీసీ జేఏసీ నాయకులు కలిసి మద్దతు కోరగా మద్దతును ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, గంగాకిషన్, రవీందర్, దేవేందర్, శంకర్, బాలన్న, నర్సింలు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆర్డీవో


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఇందల్వాయి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొనుగోలు కేంద్రాన్ని నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే తూకం వేయాలని అన్నారు. ఏగ్రేడ్ ధాన్యానికి రూ.2389, బీగ్రేడ్ ధాన్యానికి రూ.2369లు ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా బాధ్యత వహించాలని తహశీల్దార్ వెంకట్రావు, పీఏసీఎస్ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోపాల్ మాణిక్యం, గంగారాం, డాక్టర్ పరమేష్, ఆర్‌ఐ మోహన్, వీడీసీ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, క్లస్టర్ అధికారి సత్యనారాయణ, మానిటరింగ్ అధికారి మయూరి, సెక్రెటరీ శ్రీకాంత్, సెంటర్ ఇంచార్జి ప్రసాద్, కిషన్, రవి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

» పీడీఎస్‌యూ డిమాండ్


ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవలెబుల్ స్కీమ్ 210 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బాధిత విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ధర్నా చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తామంటూ గొప్పలు చెప్పుకుంటూ విద్యార్థులను ప్రభుత్వాలు రోడ్డు మీదకు తేవడం దుర్మార్గమన్నారు. భావి భారత పౌరులకు ఉచిత విద్యను అందించాల్సిన ప్రభుత్వాలు విద్యార్థుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు, యూనివర్సిటీ విద్యార్థులకు చెల్లించాల్సిన బెస్ట్ అవలెబుల్ స్కీమ్ నిధులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెహాన్, సృజన్, అజయ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవలెబుల్ స్కూల్ రూ.250 కోట్లను విడుదల చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు నవాతే ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవలెబుల్ స్కూల్స్ 300కు పైగా ఉన్నాయని వీటిలో సుమారు రూ.250 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని వెనుకబడిన తరగతుల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. వీరిపై చిన్నచూపు చూడటం సరికాదని లేని పక్షంలో రాష్ట్రం మొత్తం ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవర్ల నాగరాజు, రాజన్న, గౌతమ్‌కుమార్, సంజయ్, మోసిన్, బాల్‌రాజ్, ప్రశాంత్, శ్రీకాంత్, కిరణ్, సతీష్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

సైబర్ నేరాల నియంత్రణపై ఖాతాదారులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇందల్వాయి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో సోమవారం ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాదారులు ఇటీవల సైబర్ నేరాల వల్ల తమ డబ్బును నష్టపోతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిచ్‌పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్-2 సుమనరెడ్డి కోరారు. ఖాతాదారుడు తమకు గుర్తుతెలియని వారి నుంచి వచ్చే మెస్సేజ్‌లను ఓపెన్ చేయకూడదని, ఓటీపీ నెంబర్లు ఎవరికి తెలపకూడదని అన్నారు. తమ ఖాతా నుండి సైబర్ నేరం కింద నష్టపోతే గంటలోపు 1930 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. బ్యాంకు నుంచి ఏదైనా మెస్సేజ్‌లు, ఓటీపీలు, లింక్‌లు వస్తే వాటిని ఓపెన్ చేయకుండా నేరుగా బ్యాంకు వచ్చి సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరు సైబర్ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ వారియర్ నిర్మల జ్యోతి, బ్యాంకు మేనేజర్ భాస్కర్, ఖాతాదారులు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ స్కూల్ గేమ్స్


విజేతలుగా నిలిచిన జట్టు

సుభాష్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 69వ స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి అండర్-17 వాలీబాల్, అండర్-14 కబడ్డీ బాలబాలికల పోటీలు సోమవారంతో ముగిసాయి. జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో జరిగిన 16 జోన్‌ల బాలబాలికల జట్టు పోటీలో అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో నందిపేట్ జోన్ ప్రథమ స్థానంలో నిలువగా డిచ్‌పల్లి జోన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో ఆర్మూర్ రూరల్ జోన్ ప్రథమ స్థానంలో నిలువగా డిచ్‌పల్లి జోన్ ద్వితీయ స్థానం అందుకుంది. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో భీంగల్ రూరల్ జోన్ ప్రథమ స్థానం, ఆర్మూర్ రూరల్ జోన్ ద్వితీయ స్థానం అందుకుంది. బాలికల విభాగంలో నిజామాబాద్ అర్బన్ జోన్ ప్రథమ స్థానం, నందిపేట్ జోన్ ద్వితీయ స్థానం పొందింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి, డీవైఎస్‌వో పవన్‌కుమార్, సీఐ నగేష్ హాజరై గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

రేపు అండర్-19 నెట్‌బాల్ బాలబాలికల ఎంపికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నెట్‌బాల్ అండర్-19 బాలబాలికల ఎంపికలు ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. నగరంలోని సారంగపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు మైదానానికి చేరు కోవాలని తెలిపారు. మిగతా వివరాల కోసం ఫిజికల్ డైరెక్టర్ కృష్ణంరాజు 94902 90596 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్‌గా పోతన్‌కర్ లక్ష్మీనారాయణ



ఇందూరు, అక్టో బరు 13 (ఆంధ్ర జ్యోతి): గీతా భవన్‌లో బీసీ కమిటీల అన్ని సంఘాలతో జేఏసీ రాష్ట్ర కమిటీ సూచన మేరకు జిల్లా కమిటీ నియమించామని బీసీ నాయకుడు రేవంత్ అన్నారు. జిల్లా చైర్మన్‌గా పోతన్‌కర్ లక్ష్మీనారాయణను నియమించినట్లు తెలిపారు. కోచైర్మన్ బొబ్బిలి నర్సయ్య, రాష్ట్ర కమిటీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు నియమించారన్నారు.


నసురుల్లాబాద్ రామాలయంలోకి చొచ్చుకుని వచ్చిన మురికి నీరు

మురికి నీరు చేరడంతో ఇబ్బందులు

నసురుల్లాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల డ్రైనేజీ నీరు సోమవారం స్థానిక రామాలయం ప్రాంగణంలోకి చేరింది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆలయానికి వచ్చే భక్తులు రోజూ అసహనానికి గురవుతున్నారని గ్రామస్థులు ఆలయ కమిటీ సభ్యులు వాపోతున్నారు. ఈ సమస్యపై రామ మందిర్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాలపై పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు, కాంట్రాక్టర్ చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. డ్రైనేజీ నీరు ఆలయంలోకి చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రామ మందిర్ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి


బీర్కూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహబూబ్

బీర్కూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ నెలాఖరు వరకు తమ తమ గ్రామాల్లో నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో మహబూబ్ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినా కొందరు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. అయితే కార్యదర్శులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ముగ్గులు వేయించాలన్నారు. వారం రోజుల లోపు ఇళ్లు బేస్మెంట్ లెవెల్ పూర్తి చేయాలన్నారు. అలాగే వచ్చే వారం లోపు ప్రతీ గ్రామ పంచాయతీలో ఒక ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశం కోసం సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఇందిరమ్మ కమిటీ తో చర్చించి ఇళ్ల నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలన్నారు.

పోలీసులకు చలి దుస్తుల పంపిణీ


దుస్తులను పంపిణీ చేస్తున్న సీపీ

సుభాష్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏఆర్, సివిల్ పోలీసులకు ఉలెన్ జాకెట్లను పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అందజేశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి ఉలెన్ జాకెట్లను, అవర్ సాక్స్‌లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సాయిచైతన్య మాట్లాడుతూ చలికాలం సమీపిస్తున్న సందర్భంగా ప్రతీఒక్కరు ఈ ఉలెన్ జాకెట్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎప్పుడూ దగ్గర ఉంచుకొని అవసరం కోసం ఉపయోగించుకోవాలని కోరారు. దుస్తులను అందజేసిన వారిలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, ఆర్ఎస్సై నిశిత్, సుమన్, తదితరులు ఉన్నారు.

సమస్యల వలయంలో పల్లెలు

» పత్తా లేని ప్రత్యేక అధికారులు

» మరో వైపు పలు గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలకు ఇబ్బందులు

» గ్రామాలవైపు కన్నెత్తి చూడని ఎంపీడీవో


హాజీపూర్ రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

నసురుల్లాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పల్లె ప్రగతిని కాపాడాల్సిన ఎంపీడీవో పల్లెపాలన పట్టించుకోకుండా గాలికి వదిలేశారు అనడానికి నస్రులాబాద్ మండలంలోని ఆయా గ్రామాలే నిదర్శనం.. నసురుల్లా బాద్ మండలంలోని ఆయా గ్రామలలో సమస్యలు తాండవిస్తున్నాయి. గ్రామంలో ప్రజలకు కనీసం తాగడానికి మంచినీరు లేక మురుగు కాలువల్లో పారుతున్న కసికేడు నీళ్లను పోగు చేసుకుని తాగు తున్నారు.. ఇంటింటి నల్లాను కాపాడాల్సిన ప్రజా పరిషత్ అధికారి పట్టించుకోకపోవడంతో తమకు ఈ గతీ పట్టిందని మండలములోని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు.. స్థానిక పంచాయతీ కార్యదర్శులకు పలుమార్లు తమ గోడును వెల్లబుచ్చుకున్నా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు చెబుతున్నారు.. గ్రామంలో పారిశుధ్య లోపం ఒకవైపు ఉంటే మరోవైపు పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.. మురుగునీరు రోడ్డుమీద ప్రవహిస్తుండడంతో గ్రామాల ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.


బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం

గ్రామం వైపు కన్నెత్తి చూడని ఎంపీడీవో

మండలంలో ఆయా గ్రామాలను పర్యవేక్షించాల్సిన మండల అభివృద్ధి అధికారి కనీసం గ్రామాల వైపు చూడడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టి మూడు నెలలు కావొస్తున్న గ్రామాలకు వెళ్లకుండా వీధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నానంటూ మండల ప్రజలు ఎంపీడీవోపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మండల కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా చూడాలి

తాడ్వాయి, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తయ్యేలా చూడాలని మండల కార్యదర్శులకు, ఐకేపీ సిబ్బందికి ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం ఐకేపీ మండల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కృష్ణాజివాడీ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఐకేపీ సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు.



దోమకొండలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘ నాయకులు

ఐక్యపోరాటంతో రిజర్వేషన్లు సాధించుకుంటాం

దోమకొండ, కామారెడ్డి టౌన్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల ఐక్యపోరాటంతో 42 శాతం రిజర్వేషన్లను సాధించుకుంటామని మండల బీసీ సంఘం నాయకులు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని దోమకొండలో గాంధీవిగ్రహం వద్ద అబ్రబోయిన రాజేందర్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. బీసీలకు న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 42శాతం రిజర్వేషన్‌కు కేంద్రప్రభుత్వం సహా బీఆర్ఎస్, అగ్రకులనాయకులు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గవర్నర్ సైతం ఆరునెలలుగా ఈ చట్టాన్ని పెండింగ్‌లో ఉంచడంతో ప్రత్యేక జీవో ద్వారా బీసీలకు న్యాయం చేయాలని రాష్ట్రప్రభుత్వం భావించిందని తెలిపారు. ఈ రిజర్వేషన్‌పై హైకోర్టు స్టే ఇవ్వడం అన్యాయమని అన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే ఓసీలకు కూడా రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌కు ముందు బీసీ మండల కమిషన్ నివేదికపై అవగాహన చేసుకోవాలని అన్నారు. బీసీ నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్, నర్సయ్య, శేఖర్, పున్న లక్ష్మణ్, సీతారాం, మధు, రాములు, మల్లేష్ యాదవ్, సుధాకర్ యాదవ్, షమీనహీం, తిరుపతి, శ్రీను పాల్గొన్నారు.



కామారెడ్డిలో నినాదాలు చేస్తున్న నాయకులు

● అగ్రవర్ణాల కుట్రలను తిప్పికొడతామని బీసీ సంఘ నాయకులు అన్నారు. సోమవారం కామారెడ్డిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టసభల్లో ఆమోదం పొంది తీసుకొచ్చిన జీవో-9కు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేసి స్టే రావడానికి కారణమైన రెడ్డి జాగృతి నేతలకు, బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న అగ్రవర్ణాల నాయకులకు త్వరలోనే బుద్ధిచెప్తామన్నారు. స్టేవచ్చిన వెంటనే టపాసులు కాల్చి సంబరాలు చేసుకోవడం శోచనీయమన్నారు. నాయకులు నాగరాజు, లక్ష్మణ్, రాజేందర్, స్వామి, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.

వంతెన లేక రైతన్నకు పాట్లు



ప్రమాదకరంగా వాగు దాటుతున్న రైతులు

» గత్యంతరం లేక చెక్‌డ్యాం అంచు వెంబడి ప్రయాణం

» పొరుగు గ్రామాలకు వెళ్లాలంటే 10కి.మీ అదనం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇంటికి చేరాలంటే ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన లేక పొలాలకు వెళ్లడమే కాకుండా, ధాన్యం రవాణాకు సైతం తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. వెరసి ట్రాక్టర్ కిరాయిలు అధికమవుతున్నాయని విచారణ వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లాలంటే చెక్‌డ్యాం అంచువెంట ప్రమాదకరంగా ప్రయాణించక తప్పడం లేదు.

మూడు గ్రామాల రైతుల ఇక్కట్లు

మండల పరిధిలోని కళ్యాణి, హరిజనవాడ, లింగారెడ్డిపేట్ గ్రామాల కర్షకులకు ఆయా గ్రామాల శివారులోని పంట పొలాలకు వెళ్లాలంటే సాహసం చేయక తప్పడం లేదు. కారణం గ్రామాల శివారులో ఉన్న కళ్యాణీ వాగుపై వంతెన లేకపోవడమే. వాగులో నీటిప్రవాహం ఎక్కువగా ఉంటే పంటలను చూసుకోవడం కష్టమవుతుందని, నీటిప్రవాహం తగ్గేవరకు ఎదురుచూడాల్సి వస్తుందని చెబుతున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

ఇటీవలి వర్షాలకు కళ్యాణీవాగు ఉధృతంగా ప్రవహించిన విషయం తెలిసిందే. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదకరంగా వాగు దాటుతూ వెళ్లాల్సి వస్తోందని మహిళా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేదంటే చెక్‌డ్యాం అంచున ప్రవాహం తక్కువ ఉన్న చోటు నుంచి ప్రయాణించాలని చెబుతున్నారు.

చుట్టూ తిరిగి వస్తే 10కి.మీ

కష్టపడి పండించిన ధాన్యాన్ని శివారులోని పంటపొలాల నుంచి ఇంటికి ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకోవాలంటే తిప్పలు తప్పడం లేదు. వాగులు దాటి గ్రామాలకు రావాలంటే తిమ్మారెడ్డి గ్రామ రోడ్డు ద్వారా దాదాపుగా 10కి.మీ అదనంగా తిరిగి తెల్లాల్సి వస్తుందని అంటున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగు దాటాలంటే ఇబ్బంది



కళ్యాణీ వాగు దాటి శివారులో పంటపొలాలకు వెళ్లాలంటే వర్షాకాలంలో తీవ్రమైన ఇబ్బంది ఏర్పడుతోంది. పంటలకు సమయానికి కలుపు తీయడానికి, మందులు వేసే సమయంలో వాగు ప్రవహిస్తే పంట సంరక్షణ చేయలేకపోతున్నాం. దీంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మించాలి.

● దుర్గయ్య, రైతు



లింగంపేటలో పీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రామ్ అధికారి

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

లింగంపేట, అక్టోబర్ 13, (ఆంధ్రజ్యోతి): ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (పీవో ఎంసీహెచ్) యామీమ అన్నారు. సోమవారం ఆమె లింగంపేట పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులను మొదటి రోజు నుంచి 12 వారాలలోపు నమోదు చేయాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన వైద్యురాలు హిమబిందు మెటర్నిటీ సెలవుల అనంతరం తిరిగి విధుల్లో చేరడంతో ఆమెకు బాధ్యతలు అప్పగించారు. అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు హిమబిందు, రాంబాయి, వేణుగోపాల్, చంద్రకళ, యాదగిరి, సుభాష్, ప్రదీప్, ఏఎన్ఎంలు రాజమణి, రాజేశ్వరి, ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

కామారెడ్డి రూరల్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో అండర్-14 బాలబాలికల జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఇటీవల నిర్వహించినట్లు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల నుంచి జిల్లా తరఫున కబడ్డీ కెప్టెన్‌గా అంకం రిషిక (8వ తరగతి), బి. అస్మిత ఎంపికయ్యారు. కాగా మంగళవారం జరిగే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కామారెడ్డి జిల్లా తరఫున వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు వారికి అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లాస్థాయిలోనూ విద్యార్థులు రాణించి జిల్లా పేరును నిలపాలని కోరారు.



ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

19, 20 తేదీల్లో కబడ్డీ టోర్నీ

కామారెడ్డిటౌన్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 19, 20వ తేదీల్లో సీహెచ్ శ్రీనివాస్ స్మారక ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు భాస్కర్, రాజు సోమవారం తెలిపారు. మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండవ బహుమతిగా రూ.10 వేలు, మూడవ బహుమతిగా రూ.5వేలు అందించనున్నట్లు వివరించారు. గెలుపొందిన క్రీడాకారులకు కప్, ప్రైజెస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కబడ్డీ క్రీడ మ్యాట్‌పైన నిర్వహిస్తారని, షూస్, డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒక టీం నుంచి ఆడిన క్రీడాకారుడు మరో టీంలో ఆడరాదని తెలిపారు. వివరాలకు 9989215251, 9440037833 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్

రామారెడ్డి ఎస్సైగా రాజశేఖర్

రామారెడ్డి, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల ఎస్సైగా పి.రాజశేఖర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇదివరకు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి రామారెడ్డికి బదిలీపై వచ్చినట్లు వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదుచేయాలి

5వ పేజీ తరువాయి

నల్ల జెండాలతో కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దళితుడైన జస్టిస్ న్యాయవాదిపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దాడిచేసిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్ష పడేలా చూడాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంథని సామ్యేల్, నాయకులు పద్మారావు, యాదగిరి, లక్ష్మీ, సాయిలు, గంగన్న బాలరాజాగౌడ్, సాయిలు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యులను నియమించాలని నిరసన

కామారెడ్డిటౌన్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పశువైద్య ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని పాడిరైతులు సోమవారం ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న ఆసుపత్రిలో పశువైద్యులు లేరని అన్నారు. ఒకరిద్దరు కిందిస్థాయి సిబ్బంది ఉన్నప్పటికీ వారు అందుబాటులో ఉండరని ఆరోపించారు. సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదని విమర్శించారు. పశువులకు వైద్యంకోసం వస్తే మందులు లేవని చెబుతున్నారని ఆరోపించారు. పైగా ప్రైవేట్ మెడికల్ దుకాణాలలో మందులు తీసుకోవాలని సూచిస్తున్నారన్నారు. రైతులకు సహాయం చేయని ఆసుపత్రి ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యుడిని నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలని కోరారు.



ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న పాడిరైతులు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాఠశాలలో వైద్యశిబిరం

రాజంపేట, ఆగస్టు 13, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్యసంరక్షణపై పలు సూచనలు చేసి మందులు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.హరీష్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం, డా.గౌతమి, ఫార్మసిస్ట్ స్వప్న, ఏఎన్ఎం నీరజ, శ్యామ్‌రావు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డా.ఆస్మా

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

సదాశివనగర్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో సీపీఆర్ నిర్వహించడంతో ప్రాణాలను కాపాడవచ్చునని వైద్యాధికారిణి ఆస్మా తెలిపారు. సోమవారం సదాశివనగర్ మండలంలోని మర్కల్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, విద్యుత్ షాక్, అకస్మాత్తుగా గుండె ఆగిన సందర్భంగా సీపీఆర్ చేస్తే మనిషి అధిక శాతం బతికే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, అటువంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను వినియోగిస్తే జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాధిక, మెడికల్ ఆఫీసర్ నాగరాజు, కళాశాల, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో కానిస్టేబుళ్ల పాత్ర కీలకం

దోమకొండ (బీబీపేట), అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): బీబీపేట పోలీసుస్టేషన్‌ను సోమవారం ఎస్పీ రాజేష్‌చంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలు, సిబ్బంది బ్యారక్, రోల్‌కాల్ పరిశీలించారు. హాజరైన, గైర్హాజరైన సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తు ప్రక్రియలో కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి కేసును నిజాయతీతో, నైపుణ్యంతో, సమగ్రంగా విచారించి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి పోలీసుఅధికారిపై ఉందన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులపై వేగంగా స్పందించి తక్షణమే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవడం ద్వారా



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

మెరుగైన పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద చర్యలపై వెంటనే స్పందించాలని సూచించారు. సస్పెక్ట్‌ల ప్రతి కదలికలపై నిఘాపెట్టాలని తెలిపారు. ఆయన వెంట ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఎస్ఐ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి రూరల్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవునిపల్లి ఎస్సై భువనేశ్వర్ సూచించారు. సోమవారం కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో పోలీసు కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కంప్యూటర్ టెక్నాలజీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో కూడా ప్రజలు మూఢనమ్మకాలను నమ్మడం సరికాదన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న అనారోగ్య సమస్యలు రాగానే మంత్రాలు చేశారని తాయత్తులు కట్టించుకోవడం, అనుమానాలు పెంచుకొని గొడవలు పడటం మంచిది కాదన్నారు. గ్రామంలో ప్రజలంతా స్నేహభావంతో కలిసి ఉండాలని తెలిపారు. ఎవరైనా మంత్రాలు చేశారని గొడవలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం మూఢనమ్మకాలపై కళాజాత తిరుపతి బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుదర్శన్‌రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై భువనేశ్వర్

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

ఆలూరు, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం పరిధిలోని మచ్చర్ల గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, ఏఈ నితీష్, సెక్రెటరీ నజీర్‌లు ప్రత్యేక పూజలు చేసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఉంగరాల భూమన్న, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరల పోస్టర్ విడుదల

5వ పేజీ తరువాయి

కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ,మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ఇస్రో క్విజ్ ఫలితాలు..

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు నిర్వహించిన ఇస్రో క్విజ్ పోటీల ఫలితాలను కలెక్టర్ సోమవారం విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో ఆసక్తి కనబరచడం అభినందనీయమని,ఇస్రో క్విజ్ వంటి కార్యక్రమాలు వారి విజ్ఞాన పరిధిని విస్తరించి, భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి మార్గం చూపుతాయని తెలిపారు. ఇందులో ఎంపిక చేయబడిన విద్యార్థినులను ఇస్రో సందర్శనార్థం తీసుకెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అణగారిన వర్గాల గొంతుక

5వ పేజీ తరువాయి

సిద్ధాంతం కులం,మతం లేదా ధనం తరగతితో సంబంధం లేకుండా సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అందరిని కలుపుకుని పోయేలా ఉంటుందని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం ప్రతి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలోని అన్ని విభాగాలను సంప్రదించడంతో పాటు పార్టీలో పనితీరు, ఎన్ని సంవత్సరాల నుంచి పార్టీకి సేవలందిస్తున్నాడు ఏ రకంగా ప్రజలు,నాయకులు,కార్యకర్తల్లో గుర్తింపు వుందో పరిశీలించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం తాలుక, మున్సిపాలిటి, మున్సిపల్ వార్డులను సందర్శించి అట్టడుగు స్థాయి కార్యకర్తలతో సంప్రదించి కొత్త స్థానిక నాయకులను నియమిస్తారని తెలిపారు. యువకులు,విద్యావంతులు,సైద్ధాంతిక నిబద్ధత కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని 55 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడానికి కొత్త ముఖాలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. పరిశీలకుల పర్యటన తర్వాత,నియామకాలను ఖరారుచేయడానికి రాష్ట్రనాయకత్వానికి నివేదికలు సమర్పించబడుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్‌షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, టీపీసీసీ కోఆర్డినేటర్ వరుణ్, పీసీసీ అబ్జర్వర్ అశోక్‌రెడ్డి, కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, యువజన కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు మహ్మద్ ఇలియాస్, గ్రంథాలయసంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి,జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,మాజీ డీసీసీబీ చైర్మన్ ఎడ్లరాజిరెడ్డి, ఐరేని సందీప్, గంప ప్రసాద్ పాల్గొన్నారు.

వరి కోత యంత్రం గంటకు రూ.4వేలు

5వ పేజీ తరువాయి

ఇసుమేటలు పెట్టి నీటమునిగి, కొట్టుకుపోయి నష్టపోయారు. కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు సైతం ఇబ్బందులు తప్పట్లేదు. ట్రాక్టర్లు కోత యంత్రాల వద్దకు వెళ్లలేకపోతున్నాయి. దీం తో యంత్రాల ద్వారానే కోసిన ధాన్యాన్ని కొంత దూరం వరకు తీసుకురావల్సి వస్తుంది దీంతో ఖర్చు అదనంగా అవుతుందని కర్షకులు బాధపడుతున్నారు. ఇన్ని విధాలుగా శ్రమించి కోసిన ధాన్యాన్ని ఆరబెడదామంటే వాతావరణం అనుకూలించక ఎప్పుడు వర్షం కురుస్తుందోనని రైతులకు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే వరి కొనుగోలు కేంద్రాలలో వెంటనే తూకం ప్రారంభించి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.



భిక్కనూరు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్తత

భిక్కనూరు, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద జంగంపల్లి గ్రామానికి చెందిన ఓ వర్గం వారు పెద్ద మొత్తంలో తరలిరావడంతో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబంలో ఒకరు అకస్మాత్తుగా మరణించగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన ఓ మహిళ మంత్రాలు చేయడం కారణంగానే ఇలా జరిగిందని కులపెద్దల దృష్టికి బాధిత కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. దీంతో దాదాపు 10 గ్రామాలకు చెందిన ఆ కుల పెద్దలతో ఇటీవల పంచాయితీ ఏర్పాటుచేసి మంత్రాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్న మహిళ కుటుంబానికి రూ.2.75లక్షల జరిమానా విధించారు. జరిమానా చెల్లించడం ఇష్టం లేని వారు భిక్కనూరు పోలీసులను సోమవారం ఆశ్రయించారు. పోలీసులు కులపెద్దలను పోలీసుస్టేషన్‌కు రావాలంటూ ఫోన్ చేశారు. దీంతో వారు పెద్దఎత్తున పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి బైఠాయించారు. మంత్రాలు చేసే వారి మాటలు నమ్ముతారు కానీ తమను నమ్మరా అంటూ పోలీసులతో వాగ్వాదం చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎస్సై ఆంజనేయులు, సిబ్బందితో కలిసి వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

చేపపిల్లల పంపిణీ లేనట్టేనా?

5వ పేజీ తరువాయి

ప్రభుత్వాలు ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేశాయి. ఈ ఉచిత చేపపిల్లల పథకం ద్వారా మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. గత రెండేళ్లుగా చేపపిల్లల పంపిణీ సక్రమంగా సాగకపోవడంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు.

● 2.82 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం

జిల్లాలో ఈసారి భారీ వర్షాలు కురిశాయి. చెరువులు,కుంటలు,ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. 765 వరకు చెరువులు ఉన్నాయి. కుంటలు,చిన్నచెరువుల్లో 35-40 మి.మిల చేపపిల్లలను, 80-100 మి.మిల చేపపిల్లలను సరాఫరాచేసేందుకు సంబంధిత శాఖ నిర్ణయించింది. జిల్లావ్యాప్తంగా ప్రాజెక్టులు, చెరువులు,కుంటల్లో మొత్తం 2.82 కోట్ల చేపపిల్లలను వదిలేందుకు టెండర్లు నిర్వహిస్తున్నారు. ఇందుకు కాంట్రాక్టర్‌ల నుంచి టెండర్లను ఆహ్వానించారు. జిల్లాలో ప్రాజెక్టులు,చెరువులు,కుంటల్లో చేపపిల్లలను వదలడం వల్ల మత్స్యసంఘాల్లోని 13,894 మంది సభ్యులకు ఉపాధి లభిస్తుంది.

● మూడుసార్లు టెండర్లు పిలిచినా..

జిల్లాలో ఉచిత చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఆధ్వర్యంలో గత నెలరోజుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికి మూడుసార్లు టెండర్లను పిలువగా ఒకరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. కామారెడ్డి జిల్లాలోనే కాకుండా నిర్మల్, కరీంనగర్,మెదక్ జిల్లాలోను చేపపిల్లల పంపిణీకి కాంట్రాక్టర్‌ల టెండర్లకుముందుకు రాకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.ఇలా మిగితా 10 జిల్లాలోను ఒకరు చొప్పున మాత్రమే టెండర్లు వేశారు. ఇలా 14 జిల్లాల్లో చేపపిల్లల పంపిణీ కార్యక్రమం అనుమానమేనని సంబంధిత అధికారులు చెబుతున్నారు.అయితే గత రెండు సంవత్సరాల నుంచి చేపపిల్లలను పంపిణీచేసిన కాంట్రాక్టర్‌లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ముందుకు రావడం లేదని తెలుస్తుంది. జిల్లాలో రెండుసంవత్సరాలకు సంబంధించి కాంట్రాక్టర్‌లకు రూ.3కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.దీంతో టెండర్ల దాఖలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

● గత ఏడాది నామమాత్రంగానే

గతేడాది కూడా టెండర్ల ప్రక్రియలో జాప్యం జరగడం, చేపపిల్లలు సరాఫరా చేసిన కాంట్రాక్టర్‌లకు పాతబకాయిలు అందకపోవడంతో పంపిణీలో ఆలస్యమైంది. కాంట్రాక్టర్‌ల నుంచి చేపపిల్లలు అందేసరికి అదునుకూడా దాటిపోయింది. గతేడాది 1.38 కోట్ల చేపపిల్లలను 778 చెరువుల్లో, నిజాంసాగర్, కౌలాస్, పోచారం ప్రాజెక్ట్‌ల్లో వదిలారు. అదునుదాటక వదలడంతో ఎదుగుదలపై ప్రభావం చూపింది. గతంలో 3 కోట్లకు పైగా చేపపిల్లలను వస్తున్నారు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో గత ఏడాది నామమాత్రంగా 1.38 కోట్ల చేపపిల్లలను మాత్రమే వదిలారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కానిస్టేబుల్
ప్రియ 35- కాంతార
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి ఓజీ
వెంకటేశ్వర కాంతారా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.150
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230